# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం - 17- జూన్ 2026 | సంపుటి : 4 | సంచిక : 13 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in





# వ్యవసాయానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

## సీఎం రేవంత్ రెడ్డి

- విత్తనం నుంచి కొనుగోలు వరకు పర్యవేక్షణ
- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- ఏఐ, యాప్‌లతో వ్యవసాయ ఆధునీకరణ

**హైదరాబాద్, జూన్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** రైతులకు విత్తనాల సరఫరా నుంచి పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షా కాలం, ఖరీఫ్ సీజన్ సన్నాహకాలపై ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన కీలక సూచనలు చేశారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేముల నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. పంటలు వేసిన దశ నుంచే రైతుల వివరాలు, పంటల విస్తీర్ణం,

మిగతా 2లో




# మెట్రోపై రేవంత్ వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్

- హైదరాబాద్ మెట్రోకు కేంద్ర సహకారం కొనసాగుతుంది
- ప్రాజెక్టులు అడ్డుకునే సంస్కృతి బీజేపీది కాదన్న కేంద్ర మంత్రి
- తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని స్పష్టం

2



# ఎస్ఐఆర్‌పై బీఎల్ఏలకు అవగాహన శిక్షణ

- సంగారెడ్డిలో శిక్షణ శిబిరం నిర్వహణ
- ఓటరు జాబితా సవరణపై సూచనలు
- ప్రతి కార్యకర్తకు అవగాహన అవసరం

**సంగారెడ్డి, జూన్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో నిర్వహించిన బీఎల్ఏల అవగాహన, శిక్షణ శిబిరంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఓటర్ల

మిగతా 2లో





# జపాన్ ఉపాధి అవకాశాలపై యువతకు మంత్రి మార్గదర్శనం

- జపనీస్ భాషా శిక్షణ కేంద్రం సందర్శన
- అంతర్జాతీయ ఉద్యోగాలకు నైపుణ్యాలే బలమన్న మంత్రి
- తెలంగాణ యువతకు ప్రపంచ స్థాయి అవకాశాల కల్పన లక్ష్యం

**హైదరాబాద్, జూన్ 16 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని మాధాపూర్‌లో ఉన్న కెరీర్ కన్సల్ట్జ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించిన మంత్రి, జపాన్‌లో ఉద్యోగ అవకాశాల కోసం జపనీస్ భాషా శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించి వారి అభ్యాస పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుత గ్లోబల్ పోటీ ప్రపంచంలో విదేశీ భాషలపై పట్టు సాధించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. భాషా పరిజ్ఞానం మాత్రమే కాకుండా


మిగతా 2లో

# అక్షరాస్యతలో ములుగు రాష్ట్రానికే ఆదర్శం

- ప్రతిభావంతులకు 50 సైకిళ్ల పంపిణీ
- మహిళా విద్యకు ప్రత్యేక ప్రోత్సాహం
- సేవా కార్యక్రమాలు విస్తరించాలని పిలుపు
- మంత్రి సీతక్క

ములుగు, జూన్ 16 (తెలంగాణ ముచ్చట్లు): అటవీ ప్రాంతాలు అధికంగా ఉన్న ములుగు జిల్లా అక్షరాస్యత, విద్యా ఫలితాల్లో రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది ఉన్నత లక్ష్యాలు సాధించేలా ప్రేరణ కల్పించవచ్చని పేర్కొన్నారు.

మిగతా 2లో




# గురుకులాల్లో రూ.2వేల కోట్ల కుంభకోణం

## హరీశ్‌రావు ఆరోపణలు

- మానకొండూరులో బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం
- ప్రభుత్వంపై మాజీ మంత్రి తీవ్ర విమర్శలు
- రైతులు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల ప్రస్తావన




**కరీంనగర్, జూన్ 16 (తెలంగాణ ముచ్చట్లు):**

గురుకుల విద్యాసంస్థల్లో రూ.2,000 కోట్ల కుంభకోణం జరిగిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు ఆరోపించారు. మానకొండూరు నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గురుకులాల్లో బట్టలు, బూట్ల కొనుగోళ్లకు రూ.1,200 కోట్లు, ఆహార సరఫరాలకు సంబంధించిన ఉప్పు, పప్పు, కోడిగుడ్ల టెండర్లకు మరో రూ.800 కోట్లతో ఒప్పందాలు కుదిరాయని, ఈ అంశాలపై తాను మాట్లాడితే సంబంధిత మంత్రులు సవాళ్లు విసురుతున్నారని అన్నారు. సొంత శాఖల టెండర్ల వివరాలపై మంత్రులకు కనీస అవగాహన లేదని విమర్శించారు. రైతుబంధు బకాయిల పేరుతో ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన రూ.19 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మూడు విడతలుగా రైతుబంధు చెల్లింపులు నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాను దెబ్బతీసే విధంగా రైతు డిస్కమ్ పేరుతో కొత్త కుట్ర జరుగుతోందని వ్యాఖ్యానించారు. రుణమాఫీ, పెన్షన్లు, మహాలక్ష్మి, ఇతర హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇకపై "ఎగవేతల రేవంత్ రెడ్డి"గా పిలవాలని వ్యాఖ్యానించారు.

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వ్యవసాయానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

దిగుబడి అంచనాలు, కొనుగోళ్ల వరకు ప్రతి అంశంపై వ్యవసాయ శాఖకు పూర్తి సమాచారం ఉండాలని సీఎం స్పష్టం చేశారు. రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా వచ్చే సీజన్ నుంచే ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ప్రత్యేక ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కమిటీలో వ్యవసాయ శాఖ డైరెక్టర్, పౌర సరఫరాల సంస్థ ఎండీ, ప్రణాళికా విభాగం కార్యదర్శి సభ్యులుగా ఉంటారని తెలిపారు. విత్తనాల పంపిణీ, రైతుల నమోదు, పంటల రికార్డులు, ఉత్పత్తి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు అన్ని దశలను కమిటీ పర్యవేక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలనతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రతి గ్రామంలో ఏ రైతు ఏ పంట సాగు చేస్తున్నాడనే సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని పేర్కొన్నారు. సన్న వడ్లు పండించే రైతులకు



ప్రభుత్వం బోనస్ ఇస్తున్నందున ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను సబ్సిడీపై అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతు వేదికల్లోనే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సన్న వడ్లు సాగు చేసే రైతుల పూర్తి డేటా సేకరించాలని సూచించారు. రైతు వేదికలను రైతులకు ఉపయోగపడే సేవా కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, అక్కడే రైతులు తమ వివరాలు నమోదు చేసుకొని విత్తనాలు, ఎరువులు పొందేలా వ్యవస్థను అభివృద్ధి చేయాలని చెప్పారు. వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగాన్ని ప్రోత్సహించాలని సీఎం సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో అమలు చేస్తున్న ఏఐ పైలట్ ప్రాజెక్టు ఫలితాలను అధ్యయనం చేసి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని పేర్కొన్నారు. అలాగే ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం రైతులు యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకునే విధానాన్ని ప్రవేశపెట్టాలని, యూరియాను రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా, ఇతర ఎరువుల కేటాయింపుల కోసం కేంద్ర ప్రభుత్వంతో నిరంతర సమన్వయం కొనసాగించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సూచించారు. రామగుండం ఎఫ్‌సీఐ ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే ఎరువులు తెలంగాణకు అధికంగా కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని చెప్పారు. రాష్ట్రంలోని ఎరువుల పరిస్థితిపై అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించి అవసరమైతే ఢిల్లీకి వెళ్లి కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని సూచించారు.

మార్క్‌ఫెడ్, ఆయిల్ ఫెడ్, ప్రభుత్వ డెయిరీల పనితీరుపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించే చర్యలు చేపట్టాలని, మొక్కజొన్న కొనుగోళ్లలో ప్రభుత్వం అనుసరించిన వ్యూహాలతో నష్టం తగ్గిందని పేర్కొన్నారు. ఆయిల్‌ఫెడ్‌ను లాభాల బాటలో నడిపించాలని, ప్రభుత్వ డెయిరీని మరింత బలోపేతం చేసి పాల రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# మెట్రోపై రేవంత్ వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్

**న్యూఢిల్లీ, జూన్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ మెట్రో విస్తరణ, తెలంగాణ అభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శలకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో మెట్రో ప్రాజెక్టులకు అందిస్తున్న విధంగానే హైదరాబాద్ మెట్రోకు కూడా కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని స్పష్టం చేశారు. మెట్రో ఫేజ్ 1 కోసం కేంద్రం ఇప్పటికే రూ.1,250 కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి, తెలంగాణ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉందన్నారు. తెలంగాణ కావున లేదా కిషన్ రెడ్డి వద్దంటే ప్రాజెక్టులు ఆగిపోతాయనడం సరికాదని, ఇలాంటి వ్యాఖ్యలు బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రికి తగవని వ్యాఖ్యానించారు. తాము రేవంత్ రెడ్డికి కాదు, తెలంగాణ ప్రజలకు జవాబుదారీ అని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తాను వ్యక్తిగతంగా పోరాడిన విషయాన్ని గుర్తు చేసిన కిషన్ రెడ్డి, రాష్ట్ర అభివృద్ధి కోసం గత 12 ఏళ్లుగా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తోందన్నారు. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి విషయంలో తమకు ఎవరూ పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

రైల్వే అభివృద్ధి అంశంపై మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వాల అభ్యర్థన కోసం ఎదురుచూడకుండా కేంద్రం బాధ్యతగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఎంఎంటీఎస్ ఫేజ్ 2 విషయంలో గతంలో కేసీఆర్ ప్రభుత్వం సహకరించలేదని, అయినప్పటికీ కేంద్రం ముందడుగు వేసి ప్రాజెక్టును ప్రారంభించిందని తెలిపారు. తెలంగాణకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటి కీలక ప్రాజెక్టులను కూడా కేంద్రం తీసుకొచ్చిందన్నారు. ఎన్‌సీ



డీసీ ద్వారా తెలంగాణకు భారీగా ఆర్థిక సహాయం అందించామని కిషన్ రెడ్డి వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్ల కోసం రూ.37 వేల కోట్లు మంజూరు కాగా, ఇప్పటికే రూ.34 వేల కోట్లు రాష్ట్రానికి విడుదలైనట్లు చెప్పారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు అవసరమైన ఏడీబీ రుణాలకు కేంద్రం ఎన్‌వోసీ ఇచ్చిందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన ప్రతి ప్రాజెక్టుకు కేంద్రం సహకరిస్తుందని స్పష్టం చేశారు.

హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2కు సంబంధించి కేంద్రం ఎలాంటి అడ్డంకులు సృష్టించడం లేదని కిషన్ రెడ్డి తెలిపారు. మెట్రో ప్రాజెక్టు వేగవంతం కోసం తానే స్వయంగా ముఖ్యమంత్రికి లేఖలు రాశానని చెప్పారు. ఐఆర్ఎఫ్‌సీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.13 వేల కోట్ల రుణం పొందేందుకు కేంద్రం సహకరించిందని వెల్లడించారు. రుణ ఒప్పందానికి సంబంధించిన కొన్ని నిబంధనలపై కేంద్రం సూచనలు చేసిందని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందన్నారు. ప్రాజెక్టులను అడ్డుకునే సంస్కృతి బీజేపీది కాదని, అది కాంగ్రెస్ పార్టీకి ఉండవచ్చని కిషన్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సానుకూలంగా వ్యవహరిస్తుందని, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన ప్రతి అంశంలో పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.

# ఎస్ఐఆర్‌పై బీఎల్ఏలకు అవగాహన శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

జాబితా సవరణ ప్రక్రియ, అర్హులైన ఓటర్ల నమోదు, డూప్లికేట్ పేర్ల తొలగింపు, వివరాల సవరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఓటరు జాబితాను సమగ్రంగా పరిశీలించి ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి సహకరించాలని బీఎల్ఏలకు సూచించారు.

మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ ఎన్నికల వ్యవస్థలో అత్యంత కీలకమైందని అన్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడటం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఓటరు హక్కుల పరిరక్షణలో బీఎల్ఏల పాత్ర కీలకమని అన్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న లోపాలను గుర్తించి సకాలంలో సరిదిద్దేలా పార్టీ శ్రేణులు చొరవ చూపాలని పిలుపునిచ్చారు.




శిక్షణ శిబిరంలో పాల్గొన్న నాయకులు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై పలు విలువైన సూచనలు చేశారు. ప్రజల్లో అవగాహన పెంచి అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు సురేష్ షెట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి, టీఎస్ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తూర్పు జయప్రకాశ్ రెడ్డి (జగ్గారెడ్డి), పటాన్‌చెరు కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, నీలం మధు ముదిరాజ్, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# జపాన్ ఉపాధి అవకాశాలపై యువతకు మంత్రి మార్గదర్శనం

(మొదటి పేజీ తరువాయి)

క్రమశిక్షణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వృత్తిపరమైన సామర్థ్యాలు కూడా అభివృద్ధి చేసుకుంటే ప్రపంచంలోని ఏ దేశంలోనైనా విజయవంతమైన కెరీర్ నిర్మించుకోవచ్చన్నారు. జపాన్ వంటి దేశాల్లో నైపుణ్యం కలిగిన యువతకు విస్తృత అవకాశాలు ఉన్నాయని వివరించారు.

తెలంగాణ ప్రభుత్వం యువతను అంతర్జాతీయ ఉద్యోగ మార్కెట్‌కు సిద్ధం చేసే దిశగా పలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి తెలిపారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, విదేశీ ఉపాధి అవసరాలకు అనుగుణంగా భాషా శిక్షణా కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తున్నామని చెప్పారు. యువత తమ ప్రతిభను ప్రపంచ స్థాయిలో చాటుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. జపనీస్ భాషా శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. భాషపై పూర్తి పట్టు సాధించడం ద్వారా జపాన్‌లో ఉన్నత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు ఆర్థికంగా, వృత్తిపరంగా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. ప్రపంచ స్థాయి కెరీర్ నిర్మాణానికి ఇది బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు.

యువతకు అంతర్జాతీయంగా గుర్తింపు పొందే నైపుణ్యాలను అందించడంలో ప్రత్యేక భాషా శిక్షణా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి అన్నారు. భవిష్యత్తులో మరిన్ని దేశాల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను ప్రవేశపెట్టి తెలంగాణ యువతకు విదేశీ ఉపాధి అవకాశాలను మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ శిక్షణ అనుభవాలను మంత్రితో పంచుకున్నారు. జపనీస్ భాష నేర్చుకోవడం ద్వారా జపాన్‌లో ఉద్యోగాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో కెరీర్ నిర్మించుకోవాలనే తమ లక్ష్యాలను వివరించారు. యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వారు హర్షం వ్యక్తం చేశారు. శిక్షణ కేంద్రం నిర్వాహకులు కూడా ప్రభుత్వ సహకారంతో మరింత మంది యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# అక్షరాస్యతలో ములుగు రాష్ట్రానికే ఆదర్శం

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో, రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 50 సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో నిరక్షరాస్యత అధికంగా ఉన్న వెనుకబడిన జిల్లాగా గుర్తింపు పొందిన ములుగు, ప్రస్తుతం విద్యా రంగంలో విశేష పురోగతి సాధించడం గర్వకారణమన్నారు. జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల సమిష్టి కృషి ఫలితంగానే




ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 99.30 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో మొదటి స్థానం, ఇంటర్మీడియట్ ఫలితాల్లో రెండో స్థానం సాధించగలిగిందన్నారు. జిల్లాలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని చెప్పారు. మండలాల వారీగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సైకిళ్లు అందించడం వారి విద్యాభ్యాసానికి ప్రోత్సాహంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రోటరీ క్లబ్ అందించిన సహకారాన్ని ఈ సందర్భంగా అభినందించారు.

మహిళల్లో అక్షరాస్యత పెంపొందించేందుకు చేపడుతున్న 'అమ్మకు అక్షరమాల' వంటి కార్యక్రమాలు విద్యా చైతన్యానికి దోహదపడుతున్నాయని మంత్రి తెలిపారు. మహిళలు చదువుకుంటే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో వెలుగులు నింపాలని, విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్య పొందేలా చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

# గురుకులాల్లో రూ.2వేల కోట్ల కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో 30 లక్షల మంది పేద విద్యార్థుల విద్యా భవిష్యత్తు ప్రమాదంలో పడిందని అన్నారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి కేవలం 16 వేల ఉద్యోగాలకే పరిమితమయ్యారని, పోటీ పరీక్షల దరఖాస్తు ఫీజులను పెంచి యువతపై భారం మోపారని విమర్శించారు.

రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ ఛార్జీలు, బస్సు చార్జీలు, ఆర్టీఏ ఫీజులు పెంచి ప్రజలపై అదనపు భారం మోపుతున్నారని ఆరోపించారు. మరోవైపు ఖజానా ఖాళీగా ఉందని చెబుతూ వందల కోట్ల రూపాయలతో క్యాంపు కార్యాలయాలు, ఇతర నిర్మాణాలకు ఖర్చు చేయడం విరుద్ధమని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేస్తున్నారని, అయితే అలాంటి చర్యలకు భయపడాల్సిన అవసరం లేదని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఓట్లు తొలగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారంలో ఉన్నా లేకున్నా బీఆర్ఎస్‌కు బలమైన కార్యకర్తల బలం ఉందని, పార్టీ మరింత బలోపేతంగా ముందుకు సాగుతుందని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# అక్రమ మొరం తరలింపు.. ట్రాక్టర్, జేసీబీ స్వాధీనం



**వేలేరు, జూన్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలంలోని ఎర్రబెల్లి గ్రామ శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్న సమాచారంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక ట్రాక్టర్, ఒక జేసీబీని పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు వేలేరు ఎస్సై సురేష్ తెలిపారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. అక్రమ మైనింగ్, రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్సై హెచ్చరించారు.

# ఎల్కతుర్తికి గర్వకారణం జాతీయ పోటీలకు ఎంపికైన ఆమ్రిన్



**ఎల్కతుర్తి జూన్16(తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన యువ బాక్సర్ మహ్మద్ ఆమ్రిన్ జాతీయ స్థాయి అండర్15 బాక్సింగ్ పోటీలకు ఎంపికై మండలానికి గర్వకారణంగా నిలిచింది. మహ్మద్ హుస్సేన్, యకుబీ దంపతుల కుమార్తె అయిన ఆమ్రిన్ చిన్ననాటి నుంచే బాక్సింగ్ క్రీడపై ఆసక్తి పెంచుకుని కఠోర సాధనతో ముందుకు సాగుతోంది.





జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పలు పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆమ్రిన్, ఇటీవల హైదరాబాద్‌లోని గౌలిపురలో మిత్రా వారియర్స్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించింది. ఈ విజయంతో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అర్హతను దక్కించుకుంది.

ఆమ్రిన్ సాధించిన ఈ ఘనత పట్ల ఆమె కోచ్ దేవరకొండ ప్రభుదాస్ హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతోనే ఈ స్థాయికి చేరుకుందని ఆయన తెలిపారు.

జూన్ 20, 21 తేదీలలో పంజాబ్‌లో జరగనున్న జాతీయ స్థాయి అండర్15 బాక్సింగ్ పోటీల్లో ఆమ్రిన్ తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా ఆమ్రిన్ మాట్లాడుతూ, రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావడమే తన లక్ష్యమని పేర్కొంది. ప్రభుత్వం, క్రీడా శాఖ నుంచి ప్రోత్సాహం అందితే మరింత ఉన్నత స్థాయిలో రాణించగలనని ఆశాభావం వ్యక్తం చేసింది.

ఆమ్రిన్ ఎంపిక పట్ల ఎల్కతుర్తి మండల ప్రజలు, క్రీడాభిమానులు, యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ప్రతిభావంతులైన క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదుగుతున్నారనేందుకు ఆమ్రిన్ విజయం నిదర్శనంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# శ్రీశైలంలో మోజర్ల, మద్దిగట్ల విద్యార్థుల కూచిపూడి ప్రదర్శన



**పెద్దమందడి,జూన్(15తెలంగాణ ముచ్చట్లు):** శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివారి దివ్య సన్నిధిలో సాత్విక కూచిపూడి అకాడమీ అధినేత, నృత్య గురువు శ్రీమతి సుధారాణి శిష్య బృందం నయనానందకరంగా కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కొండల్ రావు నృత్య విశేషాలను తిలకించి గురుశిష్యులను ఘనంగా అభినందించారు.ఈ ప్రదర్శనలో కొత్తకోట, మోజర్ల, మద్దిగట్ల ప్రాంతాలకు చెందిన అకాడమీ విద్యార్థులు నక్షత్ర, వర్షిణి తదితరులు పాల్గొని తమ నృత్య ప్రతిభతో భక్తులను ముగ్ధులను చేశారు.కార్యక్రమంలో గట్టు వర్షిని, గట్టు శరత్, చంద్రిక, గట్టు తేజస్విని, గట్టు విదిగ్జా, గట్టు సమీక్ష దమయంతి, అఖిత, జ్యోత్స్న శ్రీ, లాస్య, రిషిత, హిమ వర్షిని తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమంలో భక్తులు, ఆలయ అధికారులు పాల్గొని కళాకారులను ఘనంగా సత్కరించారు. శ్రీశైలం సన్నిధిలో జరిగిన ఈ కూచిపూడి నృత్య ప్రదర్శన ఆధ్యాత్మికత, సాంస్కృతిక వైభవాల సమ్మేళనంగా నిలిచి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

# దమ్మపేటలో రూ.1.20 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం





- **పాఠశాలలు, అంగన్‌వాడీలు, సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే జారె.**

**దమ్మపేట, జూన్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** అశ్వారావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట మండలంలో రూ.1.20 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మంగళవారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, రవాణా, చిన్నారుల సంక్షేమానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అంకంపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని కొడిసెలగూడెంలో టిడబ్ల్యూయూపీఎస్ పాఠశాలకు నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు. అనంతరం పట్వారిగూడెంలో రూ.36 లక్షల వ్యయంతో నిర్మించిన ఎనిమిది సీసీ రోడ్లను ప్రజలకు అంకితం చేశారు. బాలరాజుగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని దిబ్బగూడెంలో రూ.10 లక్షలతో నిర్మించిన ఎంపీపీఎస్ పాఠశాల ప్రహరీ గోడను ప్రారంభించారు. మెండివారి గ్రామంలో రూ.11.80 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ప్రారంభించారు. నాగుపల్లిలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన ఆధునిక అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, చిన్నారుల విద్య, పోషకాహారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తొట్టిపంపులో ఎంపీయూపీఎస్ పాఠశాలకు రూ.10 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను, లింగాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గొర్రెగుట్టలో ఎంపీపీఎస్ పాఠశాలకు రూ.20 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు. మారప్పగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరులో రూ.8 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని, పాత చీపురుగూడెంలోని ఎంపీపీఎస్ పాఠశాలకు రూ.10 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమైతేనే పల్లె పిల్లల భవిష్యత్తు బంగారుమయం అవుతుందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, భద్రతా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థులకు అనుకూల వాతావరణం సృష్టించడం ద్వారా ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పట్టణ విద్యార్థులతో సమానంగా పోటీపడే స్థాయికి ఎదగడం సమాజం బాధ్యత అని అన్నారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనే సంకల్పంతో రోడ్లు, విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, తాగునీటి సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం!





**అధికారులతో ఎమ్మెల్యే రాగమయి సమీక్ష**

**సత్తుపల్లి, జూన్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు జాప్యం చేయొద్దని, పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు, ప్రజా దర్బార్‌లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదేశించారు. మంగళవారం సత్తుపల్లి పట్టణంలోని ద్వారకాపురి కాలనీలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సత్తుపల్లి, వేంసూరు మండలాల అధికారులతో ఆమె విడివిడిగా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. సత్తుపల్లి మండల రెవెన్యూ అధికారులు, ఆర్ఐలు, జీపీవోలతో సమావేశమైన ఎమ్మెల్యే గ్రామాల వారీగా అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ కార్యదర్శులు, జీపీవోలు, హౌసింగ్ ఏఈల పనితీరును సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని సూచించారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హుల సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. త్వరలో రెవెన్యూ, అటవీ శాఖల సంయుక్త సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం వేంసూరు మండల ఎంఆర్వో, ఎంపీడీవో, ఎంఈఓ తదితర అధికారులతో సమావేశమై గ్రామాల వారీగా అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై సమీక్షించారు. కొంతమంది అధికారుల అలసత్వంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన వినతులను ప్రాధాన్యంగా తీసుకొని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న బడిబాట కార్యక్రమం, విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం, విద్యా బోధన అంశాలపై ఎంఈఓతో చర్చించారు. గ్రామ స్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరేలా కృషి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజా సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

# విద్యార్థుల భద్రతే లక్ష్యం అధికారులను కదిలించిన అనిల్ కుమార్





**ఎల్కతుర్తి, జూన్ 16 (తెలంగాణ ముచ్చట్లు-):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్భాపూర్ గ్రామ సమీపంలోని ఎస్ఆర్ఆర్ ఫార్మసీ కళాశాల వద్ద విద్యార్థులు ఎదుర్కొంటున్న రవాణా, భద్రతా సమస్యల పరిష్కారానికి గ్రామ ఉపసర్పంచ్ అంబాల అనిల్ కుమార్ ప్రత్యేక చొరవ చూపారు. విద్యార్థుల ఇబ్బందులను జాతీయ రహదారి (ఎన్‌హెచ్) అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో అధికారులు సానుకూలంగా స్పందించారు. మంగళవారం గ్రామస్థులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎన్‌హెచ్ అధికారులను కలిసిన అనిల్ కుమార్, కళాశాల ముందు ఉన్న డివైడర్ కారణంగా బస్సులు ఫ్లైఓవర్‌పై నుంచి వెళ్లిపోతుండటంతో విద్యార్థులు కళాశాల వద్ద దిగలేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వివరించారు. ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు ప్రమాదకర పరిస్థితుల్లో రహదారిని దాటాల్సి వస్తోందని, ముఖ్యంగా విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కళాశాల సమీపంలో డివైడర్ కటింగ్ చేయడంతో పాటు బస్సులు ఆగేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని, ప్రయాణికుల కోసం బస్ షెల్టర్ నిర్మించాలని అధికారులను కోరారు. అలాగే వల్భాపూర్ గ్రామానికి ఏర్పాటు చేయాల్సిన సైన్‌బోర్డును పొరపాటున ఇతర గ్రామం పేరుతో ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రస్తావించి, వెంటనే సరిచేసి గ్రామం పేరుతో నేమ్‌బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామానికి సంబంధించిన ఇతర రహదారి సమస్యలను కూడా అధికారులకు వివరించగా, ఎన్‌హెచ్ అధికారులు అన్ని అంశాలను సానుకూలంగా పరిశీలించి డివైడర్ కటింగ్, బస్ షెల్టర్ ఏర్పాటు, నేమ్‌బోర్డు మార్పు తదితర సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విద్యార్థుల భద్రత, గ్రామ ప్రజల సౌకర్యాల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఉపసర్పంచ్ అంబాల అనిల్ కుమార్ చొరవను గ్రామస్థులు అభినందించారు. అధికారుల హామీతో విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది.

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు అంబాల కిషోర్, గ్రామ పెద్దలు, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# బీజేపీ సిద్ధాంతాల కోసం ప్రాణత్యాగం చేసిన రవీందర్ రావుకు ఘన నివాళి



**జమ్మికుంట టౌన్ జూన్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండల మాజీ బీజేపీ అధ్యక్షుడు, స్వర్గీయ పోల్నెని రవీందర్ రావు వర్ధంతి సందర్భంగా పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు, రవీందర్ రావు సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కొలకాని రాజు, కౌన్సిలర్ శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, జీడి మల్లేష్, టంగుటూరి రాజ్‌కుమార్ మాట్లాడుతూ, 1997లో జమ్మికుంట మండల బీజేపీ అధ్యక్షుడిగా పనిచేసిన రవీందర్ రావు పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. అయోధ్య రామమందిర ఉద్యమానికి ప్రజా మద్దతు కూడగట్టడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రజా ఉద్యమాలు నిర్వహించిన రవీందర్ రావును లక్ష్యంగా చేసుకుని నక్సలైట్లు బెదిరింపులకు పాల్పడ్డారని, పార్టీని వీడాలని హెచ్చరించినప్పటికీ ఆయన వెనక్కి తగ్గలేదని తెలిపారు. అనంతరం 1997 జూన్ 15 అర్ధరాత్రి నక్సలైట్లు దారుణంగా హత్య చేశారని, ఆయనను భౌతికంగా దూరం చేసినా ఆశయాలను మాత్రం చెరపలేకపోయారని అన్నారు.

జమ్మికుంట గడ్డ నుంచి రవీందర్ రావుతో పాటు సమ్మిరెడ్డి వంటి నాయకులు దేశం కోసం బలిదానాలు చేశారని, వారి త్యాగాల ఫలితంగానే నేడు బీజేపీ కేంద్రంతో పాటు పలు రాష్ట్రాల్లో అధికారంలో ఉందని పేర్కొన్నారు. రవీందర్ రావు త్యాగాలను స్మరించుకుంటూ పార్టీ కార్యకర్తలు ఆయన ఆశయ సాధనకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు రాజేష్ ఠాకూర్, జిల్లా, పట్టణ పదాధికారులు, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆగారం వాటర్ ట్యాంక్ నుంచి వృథాగా నీటి ప్రవాహం.. పట్టించుకోని అధికారులు



**ఖిల్లా ఘనపూర్,జూన్15(తెలంగాణ ముచ్చట్లు):** ఖిల్లా ఘనపూర్ మండలం ఆగారం గ్రామంలోని తాగునీటి వాటర్ ట్యాంక్ నుంచి నీరు భారీగా లీకై వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంక్ నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ప్రతిరోజూ విలువైన తాగునీరు వృథా అవుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వాటర్ ట్యాంక్‌ను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ట్యాంక్ పరిసరాల్లో పరిశుభ్రత లేకపోవడం, లీకేజీలను సకాలంలో నివారించకపోవడం వల్ల నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని వారు పేర్కొంటున్నారు.కలుషిత నీరు సరఫరా అయితే గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు.క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి సమస్యలను గుర్తించి చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొన్నదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్ లీకేజీని అరికట్టి, మరమ్మతులు చేపట్టి ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.




# విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌ల పంపిణీ

**పెద్దమందడి,జూన్15(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మణిగిల్ల ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ప్రభుత్వం అందజేసిన ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లను గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు.జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉభయ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అడ్డాకుల వెంకటేశ్, నస్రీన్ బేగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి సమాజంలో ఆదర్శ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉభయ పాఠశాలల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, గ్రామ పెద్దలు సుంచరామోని రాములు, పోతుల రామిరెడ్డి, పొంది ప్రతాప్ రెడ్డి, మందడి బంధి, మండల శ్రీనివాస్, రాములు, సాగర్, బోడి గణేష్, బి.కే. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల విద్యా భవిష్యత్తుకు శ్రీకారం చుట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని మనోజ్ రావు




**హుజురాబాద్, జూన్ 16(తెలంగాణ ముచ్చట్లు ):** పిల్లల విద్యా జీవితానికి తొలి అడుగుగా భావించే అక్షరాభ్యాస కార్యక్రమం హుజురాబాద్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు గారు ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అక్షరాభ్యాసం అనేది ప్రతి చిన్నారి జీవితంలో అత్యంత ముఖ్యమైన ఘట్టమని, విద్యకు శ్రీకారం చుట్టే ఈ కార్యక్రమం వారి భవిష్యత్తుకు బలమైన పునాదిని వేస్తుందని పేర్కొన్నారు. నేటి చిన్నారులే రేపటి భారతదేశ భవిష్యత్తు అని, వారికి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

అక్షరాభ్యాసం కేవలం ఒక సంప్రదాయ కార్యక్రమం మాత్రమే కాదని, జ్ఞాన సముపార్జనకు ప్రారంభ బిందువుగా నిలిచే పవిత్రమైన విద్యా వేడుక అని ఆమె తెలిపారు. చిన్నారులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి (DEO) ప్రశాంత్ రెడ్డి గారు, మండల విద్యాశాఖ అధికారి (MEO) శ్రీనివాస్ గారు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధిక గారు, శోభారాణి గారు కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు.

అలాగే వార్డ్ కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చిన్నారుల ముఖాల్లో కనిపించిన ఆనందం, తల్లిదండ్రుల ఉత్సాహం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్య పట్ల ఆసక్తిని పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని అతిథులు అభిప్రాయపడ్డారు. అక్షరాభ్యాస కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిసింది.

# బలీదుపల్లిలో అవినీతి ఆరోపణలు అవాస్తవం.. సర్పంచ్, రైతులు, మహిళల స్పష్టీకరణ



**అడ్డాకల్, జూన్15(తెలంగాణ ముచ్చట్లు):** మహబూబ్నగర్ జిల్లా అడ్డాకల్ మండలం బలీదుపల్లి గ్రామంలో ఆర్టీఐ ద్వారా చేస్తున్న అవినీతి ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని గ్రామ సర్పంచ్ కోట్ల కరుణాకర్ రెడ్డి, రైతులు, మహిళలు స్పష్టం చేశారు. మంగళవారం ఓ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ముఖాముఖిలో వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ, మహిళా సంఘాలు, వరి కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఎలాంటి అవినీతి జరగలేదని తెలిపారు.వరి కొనుగోళ్లలో రైతులకు ఒక్క రూపాయి కూడా నష్టం జరగలేదని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారమే ధాన్యం కొనుగోళ్లు జరిగాయని రైతులు పేర్కొన్నారు. రైతుల ఖాతాల్లో చెల్లింపులు సక్రమంగా జమయ్యాయని, ఎలాంటి అక్రమాలకు తావులేదని వివరించారు. అలాగే గ్రామ మహిళా సంఘాల నిర్వహణలోనూ ఎలాంటి అవకతవకలు జరగలేదని మహిళలు తెలిపారు.కొందరు వ్యక్తులు వ్యక్తిగత కారణాలతో గ్రామ ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశంతో నిరాధార ఆరోపణలు చేస్తున్నారని వారు ఆరోపించారు.గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, సామాజిక మాధ్యమాలు మరియు ఇతర వేదికల ద్వారా తప్పుడు ప్రచారం చేయకుండా గ్రామ అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని సర్పంచ్, గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు విజ్ఞప్తి చేశారు. గ్రామంలో శాంతి, సామరస్య వాతావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

# గ్రామాల అభివృద్ధికి సహకరించాలి: ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరిన సర్పంచ్‌లు



**వేలేరు, జూన్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలంలోని పీచర, సోడశపెల్లి గ్రామాల అభివృద్ధి కోసం ఆయా గ్రామాల సర్పంచ్‌లు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. (ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్) ఉపాధి హామీ పథకం నిధులను వేలేరు మండలంలోని అన్ని గ్రామాలకు కేటాయించినప్పటికీ, పీచర మరియు సోడశపెల్లి గ్రామాలకు మాత్రం నిధులు కేటాయించలేదని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో రెండు గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేసి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పీచర గ్రామ సర్పంచ్ మరిజే అనిత నరసింహారావు, సోడశపెల్లి గ్రామ సర్పంచ్ వెన్నం రమాదేవి సంపత్ రెడ్డి పాల్గొని తమ గ్రామాల అభివృద్ధి అవసరాలను ఎమ్మెల్యేకు వివరించారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరారు.

# చెల్పూర్ పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

**హుజురాబాద్,జూన్ 16(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ శ్రీరాం, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభుదాస్‌తో కలిసి చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. తనిఖీలో భాగంగా ల్యాబొరేటరీ, ఫార్మసీ, ఆపరేషన్ థియేటర్ (ఓటీ) తదితర విభాగాలను సందర్శించిన అధికారులు అక్కడి నిర్వహణపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. రోగుల అవసరాలకు అనుగుణంగా సిబ్బంది స్పందించాలని సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయని అధికారులు అభినందించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వైద్య సిబ్బంది మరింత కృషి చేయాలని కోరారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రోగులకు అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలని సూచించారు.

ఈ తనిఖీ సందర్భంగా వైద్యులు, సిబ్బంది, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు. అధికారులు చేసిన సూచనలను అమలు చేసి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.

# చిన్న కాంట్రాక్టర్లకు ప్రభుత్వం అండ



- **పెండింగ్ బిల్లులు దశలవారీగా చెల్లింపు**
- **కాంట్రాక్టర్లతో ఉప ముఖ్యమంత్రి భేటీ**
- **'చలో హైదరాబాద్' కార్యక్రమం వాయిదా**

**హైదరాబాద్, జూన్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలోని చిన్న కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, సివిల్ కాంట్రాక్టర్లతో సమావేశమైన ఆయన, వారి సమస్యలు, పెండింగ్ బిల్లుల అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను వివరంగా విన్న ఉప ముఖ్యమంత్రి, ప్రభుత్వానికి సంబంధించిన పెండింగ్ బిల్లులన్నింటినీ దశలవారీగా పూర్తిగా చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. కాంట్రాక్టర్లకు రావాల్సిన బకాయిల విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తోందని తెలిపారు.

ఆర్థిక శాఖ ఇప్పటికే ప్రతినెలా నిరంతరాయంగా బిల్లుల చెల్లింపులు కొనసాగిస్తోందని భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా బకాయిల చెల్లింపులు చేపడుతున్నామని, కాంట్రాక్టర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలపై విశ్వాసం వ్యక్తం చేసిన కాంట్రాక్టర్లు ఈ నెల 18న నిర్వహించాలనుకున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నట్లు ప్రకటించారు. దీనిపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి, ప్రభుత్వంపై నమ్మకం ఉంచిన కాంట్రాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధిలో కాంట్రాక్టర్ల పాత్ర కీలకమని పేర్కొన్న భట్టి విక్రమార్క, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా పనుల అమలులో వారి సహకారం ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రభుత్వంతో సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మెంతి మొలకలు.. పోషకాల ఖజానా



- ఆరోగ్యానికి సహజ బలం
- జీర్ణక్రియకు మెరుగైన తోడు
- రోజువారీ ఆహారంలో మేలు

మెంతి గింజలను నానబెట్టి మొలకలు వచ్చిన తర్వాత తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మొలకెత్తే ప్రక్రియ వల్ల గింజల్లోని పోషకాల లభ్యత పెరిగి శరీరానికి మరింత ప్రయోజనం చేకూరుతుంది. మెంతి మొలకల్లో పీచు పదార్థాలు, ప్రోటీన్లు, ఇనుము, మెగ్నీషియం, విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన శక్తిని అందించడంతో పాటు కణాల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. రోజువారీ ఆహారంలో కొద్దిపాటి పరిమాణంలో చేర్చుకోవడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి మెంతి మొలకలు ఉపయోగకరంగా ఉంటాయి. వీటిలో ఉండే పీచు పదార్థాలు మలబద్ధకం సమస్యను తగ్గించడంలో సహాయపడతాయి. కడుపు ఆరోగ్యాన్ని కాపాడుతూ జీర్ణక్రియను సక్రమంగా నిర్వహించడంలో తోడ్పడతాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా మెంతి మొలకలు ఉపయోగపడతాయని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. అందువల్ల మధుమేహంతో బాధపడేవారు వైద్యుల సలహా మేరకు వీటిని ఆహారంలో చేర్చుకోవచ్చు. మెంతి మొలకల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. శరీరాన్ని హానికర కణాల ప్రభావం నుంచి రక్షిస్తూ ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. మొత్తానికి మెంతి మొలకలు చిన్న పరిమాణంలో కనిపించినా పెద్ద ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. సమతుల్య ఆహారంలో భాగంగా వీటిని చేర్చుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన అనేక పోషకాలను సహజంగా పొందవచ్చు.

# రాత్రి చేసిన చపాతీలను ఉదయం తినొచ్చా? నిపుణులు చెప్పిన ముఖ్య సూచనలు

- నిల్వపై ఆధారపడి ఉంటుంది
- వేడిచేసి తింటే మంచిది
- పాడైతే అసలు వద్దు




రాత్రి మిగిలిన చపాతీలను మరుసటి రోజు ఉదయం తినడం చాలా మంది ఇళ్లలో సాధారణంగా కనిపించే అలవాటు. అయితే ఇలా తినడం ఆరోగ్యానికి మంచిదేనా అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. ఆహార నిపుణుల ప్రకారం, చపాతీలను సరైన విధంగా భద్రపరిస్తే ఉదయం తినడంలో పెద్దగా ఇబ్బంది ఉండదని చెబుతున్నారు. చపాతీలను రాత్రంతా బహిరంగ వాతావరణంలో ఉంచకుండా శుభ్రమైన డబ్బాలో మూతపెట్టి నిల్వ చేయడం అవసరం. వాతావరణం వేడిగా ఉన్న ప్రాంతాల్లో ఫ్రిజ్‌లో ఉంచడం మరింత సురక్షితమని నిపుణులు సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల సూక్ష్మజీవుల పెరుగుదల తగ్గి ఆహారం తాజాగా ఉండే అవకాశం ఉంటుంది. ఉదయం తినే ముందు చపాతీలను బాగా వేడి చేయడం మంచిది. దీంతో రుచి మెరుగుపడటంతో పాటు ఆహార భద్రత పరంగా కూడా ప్రయోజనం ఉంటుంది. వేడి చేసిన చపాతీలను కూర, పెరుగు లేదా ఇతర ఆహార పదార్థాలతో కలిపి తీసుకోవచ్చు. అయితే చపాతీలకు వింత వాసన రావడం, రంగు మారడం, ఎక్కువ తడి ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తే వాటిని తినకూడదు. అలాంటి ఆహారం తీసుకోవడం వల్ల కడుపు నొప్పి, అజీర్ణం, వాంతులు వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. చపాతీలతో పాటు తీసుకునే కూరల విషయంలో కూడా జాగ్రత్త అవసరం. ముఖ్యంగా పాల పదార్థాలు, మాంసాహార వంటకాలు త్వరగా పాడయ్యే అవకాశం ఉండటంతో వాటిని సరిగా నిల్వ చేశారో లేదో పరిశీలించాలి. నిల్వలో నిర్లక్ష్యం ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది. మొత్తానికి రాత్రి చేసిన చపాతీలను సరైన విధంగా భద్రపరిచి, ఉదయం బాగా వేడి చేసి తింటే సాధారణంగా ఆరోగ్యానికి హాని ఉండదు. అయినప్పటికీ తాజాగా తయారైన ఆహారాన్ని తీసుకోవడం ఎల్లప్పుడూ ఉత్తమమైన ఎంపికగా నిపుణులు సూచిస్తున్నారు.

# సూపర్ ఫుడ్‌గా సన్‌ఫ్లవర్ గింజలు



- పోషకాలతో నిండిన ఆహారం
- గుండె ఆరోగ్యానికి అండ
- రోగనిరోధక శక్తి పెంపు

ఆరోగ్యకరమైన ఆహారాల జాబితాలో సన్‌ఫ్లవర్ గింజలు ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయి. చిన్న పరిమాణంలో ఉన్నప్పటికీ వీటిలో అనేక ముఖ్యమైన పోషకాలు ఉండటంతో నిపుణులు వీటిని సూపర్ ఫుడ్‌గా అభివర్ణిస్తున్నారు. శరీరానికి అవసరమైన ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, పీచుపదార్థం, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా లభించడం వీటి ప్రత్యేకత. సన్‌ఫ్లవర్ గింజల్లో విటమిన్ ఈ అధికంగా ఉంటుంది. ఇది శరీర కణాలను దెబ్బతినకుండా కాపాడే ప్రతిక్షకారిణిగా పనిచేస్తుంది. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, వృద్ధాప్య లక్షణాలను ఆలస్యం చేయడంలో కూడా ఈ పోషకం సహాయపడుతుంది. అందువల్ల అందం, ఆరోగ్యం రెండింటికీ ఇవి ఉపయోగకరంగా ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో కూడా సన్‌ఫ్లవర్ గింజలు కీలక పాత్ర పోషిస్తాయి. వీటిలో ఉండే అసంతృప్త కొవ్వులు రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గించడంలో సహాయపడతాయి. రక్తనాళాల పనితీరును మెరుగుపరచి గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గించవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మెగ్నీషియం, సెలీనియం వంటి ఖనిజాలు కూడా ఈ గింజల్లో పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకలను బలంగా ఉంచడంలో, కండరాల పనితీరును మెరుగుపరచడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. శరీరంలో జరిగే అనేక జీవక్రియలకు కూడా ఇవి అవసరమవుతాయి. సన్‌ఫ్లవర్ గింజల్లోని పీచుపదార్థం జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. ఎక్కువసేపు ఆకలి వేయకుండా చేయడం ద్వారా బరువు నియంత్రణకు తోడ్పడుతుంది. అందువల్ల ఆరోగ్యకరమైన వారికి ఇవి మంచి ఆహార ఎంపికగా మారాయి. అయితే వీటిని పరిమిత మోతాదులోనే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పెరుగు, పండ్ల మిశ్రమాలు, సలాడ్లు లేదా ఇతర ఆరోగ్యకరమైన వంటకాలతో కలిపి తీసుకుంటే మరింత రుచిగా ఉండటంతో పాటు పోషక విలువలు కూడా లభిస్తాయి. సమతుల ఆహారంలో భాగంగా సన్‌ఫ్లవర్ గింజలను చేర్చుకోవడం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు.



# తలనొప్పిని తేలికగా తీసుకోవద్దు

- ఒత్తిడితో పెరుగుతున్న సమస్య
- జీవనశైలి ప్రభావం ఎక్కువ
- హెచ్చరిక సంకేతాలు గుర్తించాలి

తలనొప్పి అనేది ప్రతి ఒక్కరికీ ఎప్పుడో ఒకప్పుడు ఎదురయ్యే సాధారణ ఆరోగ్య సమస్య. అయితే తరచుగా వచ్చే తలనొప్పిని నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శారీరక అలసట, మానసిక ఒత్తిడి, నిద్రలేమి వంటి అనేక కారణాల వల్ల తలనొప్పి రావచ్చు. కొన్ని సందర్భాల్లో ఇది ఇతర ఆరోగ్య సమస్యలకు సంకేతంగా కూడా ఉండవచ్చు. ప్రస్తుతం మారుతున్న జీవనశైలి తలనొప్పి సమస్యను మరింత పెంచుతోంది. గంటల తరబడి కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు చూడడం వల్ల కళ్లపై ఒత్తిడి పెరిగి తలనొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. పని ఒత్తిడి, ఆందోళన, ఆహారపు అలవాట్లలో మార్పులు కూడా ఈ సమస్యకు కారణమవుతున్నాయి. తగినంత నీరు తాగకపోవడం కూడా తలనొప్పికి ఒక ముఖ్య కారణం. శరీరంలో నీటి శాతం తగ్గినప్పుడు మెదడు పనితీరుపై ప్రభావం పడుతుంది. అలాగే భోజనం సమయానికి చేయకపోవడం, ఎక్కువసేపు ఆకలిగా ఉండడం వల్ల కూడా తలనొప్పి వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. కొంతమందిలో మైగ్రేన్ కారణంగా తీవ్రమైన తలనొప్పి వస్తుంది.

ఈ సమయంలో వెలుతురు, శబ్దం ఇబ్బందిగా అనిపించడం, వికారం వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఇలాంటి సమస్య తరచుగా ఉంటే వైద్యుల సలహా తీసుకోవడం అవసరం. తలనొప్పితో పాటు చూపు మందగించడం, మాట తడబడటం, చేతులు లేదా కాళ్లలో బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఇవి కొన్ని తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు సంకేతాలు కావచ్చు. అందుకే అసాధారణ లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు. సరిపడా నిద్ర, సమతుల ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, ఒత్తిడి నియంత్రణ ద్వారా తలనొప్పి ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. తరచూ తలనొప్పి వస్తే స్వయంగా మందులు వాడకుండా వైద్యుల సలహా తీసుకోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.



# డబుల్ చిన్‌కు కారణాలేమిటి?

- బరువు పెరుగుదల ప్రభావం
- జీవనశైలి మార్పుల ప్రభావం
- నివారణకు సరైన మార్గాలు

ముఖం కింద భాగంలో గడ్డం క్రింద అదనంగా కొవ్వు పేరుకుపోవడాన్ని సాధారణంగా "డబుల్ చిన్" అని పిలుస్తారు. ఇది కేవలం అధిక బరువు ఉన్నవారిలోనే కాదు, సాధారణ బరువు కలిగిన వారిలో కూడా కనిపించవచ్చు. ముఖ ఆకృతి మారడంతో పాటు కొందరిలో ఆత్మవిశ్వాసం తగ్గడానికి కూడా ఇది కారణమవుతోంది. ప్రస్తుతం మారుతున్న జీవనశైలి కారణంగా ఈ సమస్య ఎక్కువ మందిలో కనిపిస్తోంది. డబుల్ చిన్ ఏర్పడటానికి ప్రధాన కారణం శరీరంలో అధిక కొవ్వు నిల్వ కావడం. బరువు పెరిగినప్పుడు మెడ, గడ్డం ప్రాంతాల్లో కూడా కొవ్వు పేరుకుపోతుంది. దీనివల్ల గడ్డం కింద అదనపు పొర ఏర్పడి డబుల్ చిన్‌గా కనిపిస్తుంది. వ్యాయామం లేకపోవడం, అధిక కేలరీలు కలిగిన ఆహారం తీసుకోవడం ఈ పరిస్థితిని మరింత పెంచుతాయి. వయస్సు పెరుగుతున్న కొద్దీ చర్మం తన బిగుతును కోల్పోతుంది. చర్మంలోని కొల్లాజెన్ స్థాయులు తగ్గడంతో మెడ భాగంలోని చర్మం కిందకు వాలిపోతుంది. ఈ కారణంగా కూడా డబుల్ చిన్ కనిపించే అవకాశం ఉంటుంది. కొందరిలో ఇది వారసత్వ లక్షణంగా కూడా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు.

రోజంతా మొబైల్ ఫోన్ లేదా కంప్యూటర్ వైపు తల వంచి ఎక్కువసేపు ఉండడం కూడా ఒక కారణంగా భావిస్తున్నారు. దీనివల్ల మెడ కండరాలపై ఒత్తిడి పెరిగి చర్మం సడలిపోవచ్చు. సరైన కూర్చునే విధానం పాటించకపోవడం కూడా ఈ సమస్యకు దోహదం చేస్తుంది. డబుల్ చిన్ తగ్గించుకోవడానికి సమతుల ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అవసరం. మెడ, దవడ భాగాలకు సంబంధించిన ప్రత్యేక వ్యాయామాలు కొంతమేర ప్రయోజనం కలిగించవచ్చు. తగినంత నీరు తాగడం, శరీర బరువును నియంత్రణలో ఉంచడం కూడా ముఖ్యం. నిద్ర, ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం ద్వారా ఈ సమస్యను చాలావరకు నివారించవచ్చు. నిపుణుల అభిప్రాయం ప్రకారం డబుల్ చిన్ అనేది చాలా సందర్భాల్లో ఆరోగ్యపరమైన పెద్ద సమస్య కాకపోయినా, శరీర బరువు పెరుగుదలకు సంకేతంగా ఉండవచ్చు. అందువల్ల బరువును నియంత్రణలో ఉంచుతూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడం ద్వారా ముఖ సౌందర్యాన్ని కాపాడుకోవచ్చు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# చమురు రాజకీయాలు

- **ప్రపంచంపై పెరుగుతున్న ప్రభావం**
- **ఇంధన వనరుల చుట్టూ అంతర్జాతీయ సమీకరణాలు**
- **ధరల హెచ్చుతగ్గులతో ఆర్థిక వ్యవస్థలపై ఒత్తిడి**
- **ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు దేశాల అడుగులు**



ప్రపంచ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థలు, అంతర్జాతీయ సంబంధాలను ప్రభావితం చేస్తున్న ప్రధాన అంశాల్లో చమురు ఒకటి. ఆధునిక ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇంధనంగా నిలుస్తున్న ముడి చమురు కేవలం వాణిజ్య వస్తువు మాత్రమే కాదు. అది దేశాల విదేశాంగ విధానాలను, భద్రతా వ్యూహాలను, ప్రపంచ శక్తి సమీకరణాలను నిర్దేశించే కీలక సాధనంగా మారింది. అందుకే చమురు చుట్టూ జరిగే రాజకీయ పరిణామాలు ప్రపంచ దేశాల భవిష్యత్తుపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. పశ్చిమాసియాలోని చమురు నిల్వలు ప్రపంచ ఇంధన అవసరాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ ప్రాంతంలో చోటుచేసుకునే యుద్ధాలు, రాజకీయ అస్థిరత, దౌత్య ఉద్రిక్తతలు ప్రపంచ మార్కెట్లను వెంటనే ప్రభావితం చేస్తాయి. సరఫరాపై అనుమానాలు ఏర్పడగానే అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు పెరుగుతాయి. ఆ ప్రభావం కొన్ని గంటల్లోనే ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలపై కనిపించడం ప్రారంభమవుతుంది. చమురు ధరల పెరుగుదలతో మొదట ప్రభావితమయ్యేది రవాణా రంగం. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల రవాణా ఖర్చులు అధికమవుతాయి. దాంతో ఆహార పదార్థాల నుంచి పారిశ్రామిక ఉత్పత్తుల వరకు దాదాపు అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరిగి సామాన్య ప్రజల జీవన వ్యయం అధికమవుతుంది. చమురు దిగుమతులపై ఆధారపడిన దేశాలు ఈ పరిస్థితిని మరింత తీవ్రంగా ఎదుర్కొంటాయి.

ప్రపంచంలోని అనేక దేశాలు తమ ఇంధన అవసరాల కోసం విదేశీ చమురుపైనే ఆధారపడుతున్నాయి. ఈ ఆధారపడుదల కారణంగా చమురు ఉత్పత్తి దేశాలకు అంతర్జాతీయ రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యం లభిస్తోంది. చమురు నిల్వలు అధికంగా ఉన్న దేశాలు తమ ఆర్థిక శక్తిని దౌత్యపరమైన ప్రయోజనాల కోసం వినియోగించే పరిస్థితులు తరచూ కనిపిస్తున్నాయి. దీంతో ఇంధన భద్రత అనేది జాతీయ భద్రతలో కీలక అంశంగా మారింది. చమురు ఉత్పత్తి దేశాల సమాఖ్యలు ప్రపంచ మార్కెట్లపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. ఉత్పత్తి పరిమాణాలను పెంచడం లేదా తగ్గించడం ద్వారా ధరలను ప్రభావితం చేసే సామర్థ్యం వాటికి ఉంది. ఈ నిర్ణయాల ప్రభావం ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమలు, రవాణా రంగం, వ్యవసాయం, వినియోగదారులపై పడుతోంది. చమురు ధరలలో స్వల్ప మార్పు కూడా అనేక దేశాల బడ్జెట్లపై ప్రభావం చూపగలదు.

భారత్ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు చమురు రాజకీయాలు అత్యంత ప్రాధాన్యమైన అంశం. దేశీయ అవసరాల్లో అధిక భాగం దిగుమతుల ద్వారానే తీర్చుకోవాల్సి రావడం వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో ధరల హెచ్చుతగ్గులు నేరుగా ప్రభావం చూపుతున్నాయి. చమురు దిగుమతుల వ్యయం పెరిగితే విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి పెరుగుతుంది. వాణిజ్య లోటు అధికమయ్యే అవకాశం ఉంటుంది.

ఇటీవలి కాలంలో ప్రపంచ దేశాలు ఇంధన వనరుల వైవిధ్యీకరణపై దృష్టి సారిస్తున్నాయి. ఒకే ప్రాంతం లేదా ఒకే దేశంపై ఆధారపడకుండా వివిధ దేశాల నుంచి చమురు దిగుమతులు చేసుకునే వ్యూహాలను అమలు చేస్తున్నాయి. ఇంధన సరఫరాలో అంతరాయాలు ఏర్పడినా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం తగ్గించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి ప్రత్యామ్నాయ ఇంధనాల ప్రాధాన్యం కూడా ఇదే నేపథ్యంలో పెరుగుతోంది. సౌర, పవన, జల విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని దేశాలు వేగంగా పెంచుతున్నాయి. విద్యుత్ వాహనాల ప్రోత్సాహం కూడా చమురుపై ఆధారపడుదలను తగ్గించే దిశగా కీలక అడుగుగా భావిస్తున్నారు. దీర్ఘకాలంలో ఈ మార్పులు ప్రపంచ ఇంధన రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీయవచ్చు.

వాతావరణ మార్పులపై పెరుగుతున్న ఆందోళనలు కూడా చమురు పరిశ్రమపై ప్రభావం చూపుతున్నాయి. కార్బన్ ఉద్గారాలను తగ్గించాలనే లక్ష్యాలతో అనేక దేశాలు స్వచ్ఛమైన ఇంధనాల వైపు మళ్లుతున్నాయి. అయినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చమురుకు ప్రత్యామ్నాయాన్ని కనుగొనలేకపోయింది. అందువల్ల చమురు రాజకీయాల ప్రాధాన్యం ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రపంచ శాంతి, ఆర్థిక స్థిరత్వం, ఇంధన భద్రత పరస్పరం అనుసంధానమై ఉన్న ఈ కాలంలో చమురు రాజకీయాలను విస్మరించడం సాధ్యం కాదు. యుద్ధాలు, దౌత్య విభేదాలు, సరఫరా అంతరాయాలు ప్రపంచ ప్రజల జీవితాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. అందువల్ల ఇంధన భద్రతను బలోపేతం చేయడం, ప్రత్యామ్నాయ వనరులను అభివృద్ధి చేయడం, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడం ద్వారానే భవిష్యత్ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుంది.

# మొసళ్ల సంరక్షణకు ప్రపంచ పిలుపు



- **జీవవైవిధ్య రక్షణలో కీలకమైన జలచరాలు**
- **నివాస ప్రాంతాల క్షీణతతో పెరుగుతున్న ఆందోళనలు**
- **తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రత్యేక సంరక్షణ చర్యలు**

ప్రపంచవ్యాప్తంగా మొసళ్ల సంరక్షణ, వాటి సహజ నివాస ప్రాంతాల పరిరక్షణ అవసరాన్ని చాటిచెప్పేందుకు ప్రతి ఏడాది జూన్ 17న వరల్డ్ క్రోక్ డే నిర్వహిస్తున్నారు. కోట్లాది సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ జీవులు ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. నదులు, సరస్సులు, చిత్తడి నేలలు, మడ అడవుల జీవావరణ వ్యవస్థల్లో అగ్రశ్రేణి మాంసాహార జీవులుగా వ్యవహరిస్తూ ఆహార గొలుసును సమతుల్యంగా ఉంచుతున్నాయి. ఈ నేపథ్యంలో మొసళ్ల పరిరక్షణకు ప్రపంచ దేశాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయి. ప్రపంచంలో ప్రస్తుతం అనేక రకాల మొసళ్ల జాతులు జీవిస్తున్నప్పటికీ కొన్ని జాతులు అంతరించిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, పరిశ్రమల విస్తరణ, నదీ పరివాహక ప్రాంతాల ఆక్రమణ, అక్రమ వేట వంటి కారణాలు వాటి సంఖ్యపై ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా చిత్తడి నేలలు తగ్గిపోవడం మొసళ్ల జీవనానికి పెద్ద సవాలుగా మారింది.

జల వనరుల ఆరోగ్యాన్ని అంచనా వేయడంలో మొసళ్లు ముఖ్య సూచికలుగా పరిగణించబడతాయి. ఒక ప్రాంతంలో మొసళ్ల ఉనికి ఉంటే అక్కడి పర్యావరణ వ్యవస్థ సమతుల్యంగా ఉందని నిపుణులు భావిస్తారు. బలహీనమైన చేపలు, ఇతర జలచరాలను వేటాడడం ద్వారా జీవావరణంలో సహజ నియంత్రణ వ్యవస్థను కొనసాగిస్తాయి. ఈ కారణంగా మొసళ్లను ప్రకృతి రక్షకులుగా కూడా అభివర్ణిస్తుంటారు. భారత్‌లో మొసళ్ల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అనేక సంరక్షణ కార్యక్రమాలు అమలవుతున్నాయి. గుడ్ల సంరక్షణ, పిల్ల మొసళ్ల పెంపకం, సహజ నివాస ప్రాంతాల అభివృద్ధి, నిరంతర పర్యవేక్షణ వంటి చర్యల ద్వారా వాటి సంఖ్యను పెంచేందుకు కృషి జరుగుతోంది. గత కొన్నేళ్లలో ఈ చర్యలు సానుకూల ఫలితాలను అందిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. తెలంగాణలో శ్రీశైలం జలాశయం పరిసర ప్రాంతాలు, నాగార్జునసాగర్ పరిధి, కృష్ణా నది తీర ప్రాంతాల్లో మొసళ్ల ఉనికి నమోదవుతోంది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిసర ప్రాంతాల్లో కూడా ఈ జలచరాల సంచారం కనిపిస్తుంటుంది. అటవీ శాఖ ప్రత్యేక నిఘా ద్వారా వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటోంది. జలాశయాల వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా నదుల పరివాహక ప్రాంతాలు మొసళ్లకు అనుకూల ఆవాసాలుగా గుర్తింపు పొందాయి. ముఖ్యంగా తూర్పు గోదావరి జిల్లాలోని కోరింగా మడ అడవుల పరిసర ప్రాంతాలు జీవవైవిధ్య సంపదకు నిలయాలుగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో సహజ ఆవాసాల పరిరక్షణకు అధికారులు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. స్థానిక ప్రజల సహకారంతో సంరక్షణ చర్యలను మరింత బలోపేతం చేస్తున్నారు.

మొసళ్లపై ప్రజల్లో ఉన్న భయాందోళనలను తగ్గించడం కూడా అవసరంగా మారింది. చాలా సందర్భాల్లో మానవ జోక్యం పెరగడం వల్లే మనుషులు, వన్యప్రాణుల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయని నిపుణులు చెబుతున్నారు. సహజ నివాస ప్రాంతాలను గౌరవించడం, హెచ్చరిక బోర్డులను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పర్యాటక రంగంలో కూడా మొసళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అనేక అభయారణ్యాలు, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు దేశీయ, విదేశీ పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ప్రకృతి ప్రేమికులు ఈ జీవుల జీవన విధానాన్ని పరిశీలించేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థలకు కూడా ఊతం లభిస్తోంది.

వాతావరణ మార్పుల ప్రభావం మొసళ్లపై కూడా కనిపిస్తోంది. నదుల నీటిమట్టాల్లో మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, వరదలు, కరువు పరిస్థితులు వాటి సంతానోత్పత్తి ప్రక్రియపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో సహజ ఆవాసాల సంరక్షణకు ప్రాధాన్యం పెరుగుతోంది. శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవాలంటే ప్రతి జీవికి తగిన స్థానం కల్పించాల్సిన అవసరం ఉంది. మొసళ్ల సంరక్షణ అనేది కేవలం ఒక జాతిని కాపాడడం మాత్రమే కాదు. నదులు, సరస్సులు, చిత్తడి నేలలు, వాటిపై ఆధారపడిన జీవావరణ వ్యవస్థ మొత్తాన్ని రక్షించడం కూడా. వరల్డ్ క్రోక్ డే సందర్భంగా ఈ సందేశాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా భవిష్యత్ తరాలకు విలువైన ప్రకృతి సంపదను అందించే అవకాశం ఉంటుంది.

# పెరుగుతున్న పట్టణీకరణ.. తగ్గుతున్న వనరులు

- **నగరాల విస్తరణతో సహజ సంపదపై ఒత్తిడి**
- **నీరు, భూమి, పచ్చదనానికి పెరుగుతున్న ముప్పు**
- **సమతుల అభివృద్ధే భవిష్యత్తుకు భరోసా**



ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ అభివృద్ధికి సంకేతంగా కనిపిస్తున్నప్పటికీ, అదే సమయంలో సహజ వనరులపై తీవ్ర ఒత్తిడిని సృష్టిస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు వలసలు పెరగడం, పారిశ్రామికీకరణ విస్తరించడం, మౌలిక వసతుల అభివృద్ధి వేగం పెరగడం వల్ల నగరాలు రోజురోజుకూ విస్తరిస్తున్నాయి. ఈ పరిణామం ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నప్పటికీ నీరు, భూమి, గాలి, పచ్చదనం వంటి సహజ వనరుల క్షీణతకు కారణమవుతోంది. ఈ పరిస్థితి భవిష్యత్ తరాల జీవన ప్రమాణాలపై ప్రభావం చూపే ప్రమాదం కనిపిస్తోంది. ఒకప్పుడు పరిమిత ప్రాంతాల్లో ఉన్న నగరాలు నేడు వందల కిలోమీటర్ల మేర విస్తరిస్తున్నాయి. కొత్త కాలనీలు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలు, రహదారులు, ఫ్లైఓవర్ల నిర్మాణం కారణంగా వ్యవసాయ భూములు క్రమంగా కాంక్రీట్ అడవులుగా మారుతున్నాయి. ఫలితంగా సాగుభూమి విస్తీర్ణం తగ్గుతోంది. ఆహార ఉత్పత్తిపై దీర్ఘకాల ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పట్టణీకరణ ప్రభావం అత్యంతగా కనిపిస్తున్న రంగం నీటి వనరులు. పెరుగుతున్న జనాభా అవసరాల కారణంగా భూగర్భ జలాల వినియోగం విపరీతంగా పెరుగుతోంది. అనేక నగరాల్లో నీటి మట్టాలు ఏటా దిగజారుతున్నాయి. చెరువులు, కుంటలు, వాగులు ఆక్రమణలకు గురికావడంతో సహజ నీటి నిల్వ సామర్థ్యం క్షీణిస్తోంది. వర్షాలు కురిసినా నీరు నిల్వ కాకపోవడం మరో సమస్యగా మారింది. పచ్చదనం తగ్గిపోవడం పట్టణాల ముందు నిలిచిన మరో ప్రధాన సవాలు. రహదారుల విస్తరణ, నిర్మాణ ప్రాజెక్టుల కారణంగా వేలాది చెట్లు నరికివేయబడుతున్నాయి. ఫలితంగా నగరాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వేసవికాలంలో వేడి తీవ్రత అధికమవుతోంది. గాలి నాణ్యత కూడా క్షీణిస్తోంది. ప్రజల ఆరోగ్యంపై దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.

పారిశ్రామిక విస్తరణ, వాహనాల సంఖ్య పెరుగుదలతో కాలుష్య సమస్య మరింత తీవ్రంగా మారుతోంది. వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం, నీటి కాలుష్యం నగర జీవన నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. పట్టణాల్లో వ్యర్థాల నిర్వహణ కూడా పెద్ద సవాలుగా మారింది. జనాభా పెరుగుదలతో చెత్త ఉత్పత్తి విపరీతంగా పెరుగుతోంది. సరైన నిర్వహణ లేకపోతే చెత్త కుప్పలు పర్యావరణానికి ముప్పుగా మారుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు నేల, నీటి వనరులను కలుషితం చేస్తున్నాయి. ఈ పరిస్థితి జీవవైవిధ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోంది.

హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబై, ఢిల్లీ వంటి మహానగరాలు ప్రస్తుతం ఇదే సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఒకవైపు జనాభా పెరుగుతుండగా మరోవైపు వనరుల లభ్యత తగ్గుతోంది. తాగునీటి సరఫరా, ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం, గృహ అవసరాలు వంటి సమస్యలు మరింత క్లిష్టంగా మారుతున్నాయి. భవిష్యత్‌లో ఈ ఒత్తిడి మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. పట్టణాభివృద్ధి ప్రణాళికల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. చెరువుల సంరక్షణ, వర్షపు నీటి నిల్వ వ్యవస్థలు, పచ్చని ప్రదేశాల అభివృద్ధి, భూగర్భ జలాల పునరుద్ధరణ వంటి చర్యలు అత్యవసరంగా మారాయి. నగరాల విస్తరణతో పాటు ప్రకృతి వనరుల రక్షణకు సమాన ప్రాధాన్యం కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సాంకేతికత కూడా ఈ సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించగలదు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, నీటి వినియోగ పర్యవేక్షణ వ్యవస్థలు, సౌరశక్తి వినియోగం, వ్యర్థాల పునర్వినియోగం వంటి చర్యలు వనరుల వినియోగాన్ని సమర్థవంతంగా మార్చగలవు. ఆధునిక నగరాల నిర్మాణంలో పర్యావరణ అనుకూల విధానాలు అనివార్యంగా మారుతున్నాయి. అభివృద్ధి అవసరం ఎంత ముఖ్యమో, సహజ వనరుల సంరక్షణ కూడా అంతే ముఖ్యమైనది. పట్టణీకరణను పూర్తిగా ఆపడం సాధ్యం కాదు. అయితే ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి ద్వారా వనరులను కాపాడుకోవచ్చు. భూమి, నీరు, పచ్చదనం, పరిశుభ్రమైన గాలి వంటి ప్రకృతి సంపదలను రక్షించగలిగితేనే నగరాలు భవిష్యత్ తరాలకు నివాసయోగ్యంగా నిలుస్తాయి. సమతుల అభివృద్ధి ద్వారానే అభివృద్ధి లక్ష్యాలు, పర్యావరణ పరిరక్షణ రెండింటినీ సాధించడం సాధ్యమవుతుంది.

# పాఠశాలలు, అంగన్‌వాడీల్లో హాజరు శాతం పెంచాలి: కలెక్టర్ అంకిత్

**ఆళ్ళపల్లి, జూన్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచడంతో పాటు చిన్నారులకు నాణ్యమైన విద్య, మెరుగైన పోషకాహార సేవలు అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ ఆదేశించారు. ఆళ్ళపల్లి మండల పర్యటనలో భాగంగా ఆయన పలు విద్యా, శిశు సంక్షేమ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆళ్ళపల్లి మండల ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల హాజరు, నమోదు వివరాలను పరిశీలించారు. పాఠశాలలో అందుతున్న విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలపై ఉపాధ్యాయులతో చర్చించి, హాజరు శాతం పెంపునకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పాఠశాల ఆవరణలోని ప్రీప్రైమరీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం పనితీరును సమీక్షించిన కలెక్టర్, తల్లిదండ్రులతో నిరంతర సంప్రదింపులు జరుపుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి పిల్లల చేరికలు పెంచాలని ఆదేశించారు. హాజరు తక్కువగా ఉన్న కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

# పెళ్లిపై శ్రీముఖి ఆసక్తికర వ్యాఖ్యలు



తెలుగు బుల్లితెరపై అత్యంత ప్రజాదరణ పొందిన యాంకర్లలో శ్రీముఖి ఒకరు. తన చురుకైన మాటలు, ఉత్సాహభరితమైన వ్యాఖ్యానంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ఆమె, ప్రస్తుతం టెలివిజన్ కార్యక్రమాలతో పాటు సినిమాల్లోనూ బిజీగా కొనసాగుతున్నారు. అయితే ఇటీవల ఆమె ఎక్కడ కనిపించినా పెళ్లి గురించిన ప్రశ్నలు ఎదురవుతుండగా, తాజాగా చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

నటి సమంత ప్రధాన పాత్రలో రూపొందిన 'మా ఇంటి బంగారం' చిత్రంలో శ్రీముఖి కీలక పాత్ర పోషించారు. నందినీ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదలకు ముందు నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో పాల్గొన్న శ్రీముఖి తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ సినిమా ప్రారంభమైన సమయంలో సమంత వివాహితురాలని, ఇప్పుడు సినిమా విడుదలకు సిద్ధమవుతోందని గుర్తుచేశారు. ఈ చిత్రం ఘనవిజయం సాధించిన తర్వాత తన పెళ్లి కూడా జరగాలని కోరుకుంటున్నానని సరదాగా వ్యాఖ్యానించారు.

అలాగే ఇప్పటికీ సరైన జీవిత భాగస్వామి కోసం ఎదురుచూస్తున్నానని, మంచి వరుడు దొరికిన వెంటనే వివాహం చేసుకుంటానని తెలిపారు. పెళ్లి గురించి తాను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నానంటూ నవ్వుతూ చెప్పడంతో సభలో ఉన్నవారు చప్పట్లతో స్పందించారు.

శ్రీముఖి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశంగా మారాయి. ఆమె అభిమానులు త్వరలోనే మంచి జీవిత భాగస్వామి దొరకాలని శుభాకాంక్షలు తెలియజేస్తుండగా, మరికొందరు నెటిజన్లు 'ఇప్పుడైనా శుభవార్త చెప్పండి', 'మీ పెళ్లి కోసం మేమూ ఎదురుచూస్తున్నాం' అంటూ సరదా వ్యాఖ్యలు చేస్తున్నారు.

కెరీర్ పరంగా శ్రీముఖి ప్రస్తుతం టెలివిజన్ రంగంలో అత్యంత బిజీ యాంకర్లలో ఒకరిగా కొనసాగుతున్నారు. పలు రియాలిటీ కార్యక్రమాలు, ప్రత్యేక వేడుకలు, అవార్డు ప్రదానోత్సవాలతో పాటు సినిమాల్లోనూ వరుస అవకాశాలు అందుకుంటున్నారు. 'మా ఇంటి బంగారం' చిత్రంలో ఆమె పోషించిన పాత్ర కథలో కీలకంగా ఉండబోతుందని చిత్ర బృందం తెలిపింది.

# సింగీతం ప్రతిభకు ఎన్టీఆర్ ప్రశంసలు





ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన తాజా చిత్రం 'సింగ్ గీతం' ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతోంది. జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంటుండగా, తాజాగా యంగ్ టైగర్ ఎన్టీఆర్ చేసిన వ్యాఖ్యలు చిత్రంపై మరింత ఆసక్తిని పెంచాయి.

సినిమాను వీక్షించిన అనంతరం ఎన్టీఆర్ సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు. ఈ చిత్రం తన హృదయాన్ని హత్తుకుందని పేర్కొంటూ, 94 ఏళ్ల వయసులోనూ సింగీతం శ్రీనివాసరావు చూపించిన సృజనాత్మకత, కథల పట్ల ఆయనకున్న అంకిత భావం తనను ఆశ్చర్యపరిచిందని తెలిపారు. వయసు కేవలం సంఖ్య మాత్రమేనని, ప్రతిభకు వయసుతో సంబంధం లేదని ఈ సినిమా మరోసారి నిరూపించిందన్నారు.

చిత్రాన్ని నిర్మించిన నాగ్ అశ్విన్‌ను ప్రత్యేకంగా అభినందించిన ఎన్టీఆర్, నాలుగు దశాబ్దాలుగా సింగీతం మనసులో ఉన్న కలను తెరపైకి తీసుకురావడం గొప్ప విషయమని కొనియాడారు. ఒక లెజెండ్ కలను సాకారం చేయడం అరుదైన ఘనత అని పేర్కొన్నారు. సింగీతం శ్రీనివాసరావుకు ఈ చిత్రం అందమైన నివాళిగా నిలిచిందని అభిప్రాయపడ్డారు.

సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ పనితీరుపైనా ఎన్టీఆర్ ప్రశంసలు కురిపించారు. ఆయన అందించిన సంగీతం సినిమాలోని ప్రతి భావోద్వేగాన్ని ప్రేక్షకులకు చేరవేసిందని, కథను మరింత బలంగా నిలబెట్టిందని చెప్పారు. ప్రతి సన్నివేశంలో సంగీతం ప్రత్యేకమైన అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు.

అలాగే సినిమా ప్రచారంలో చిత్రబృందం అనుసరించిన వినూత్న విధానం తనను ఆశ్చర్యానికి గురి చేసిందని ఎన్టీఆర్ తెలిపారు. సాధారణంగా సినిమా విడుదలకు ముందే ట్రైలర్ విడుదల చేస్తారని, అయితే 'సింగ్ గీతం' విషయంలో సినిమా విడుదలైన తర్వాత ట్రైలర్ విడుదల చేయడం ఆసక్తికరంగా అనిపించిందన్నారు.

ఈ సందర్భంగా చిత్ర ట్రైలర్‌ను తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్న ఎన్టీఆర్, ప్రేక్షకులు తప్పకుండా థియేటర్లలో ఈ చిత్రాన్ని వీక్షించాలని సూచించారు. సింగీతం శ్రీనివాసరావు సృజనాత్మకతకు, నాగ్ అశ్విన్ సంకల్పానికి, దేవిశ్రీ ప్రసాద్ సంగీతానికి ఈ చిత్రం నిదర్శనంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

# 'కల్కి-2'లో ఆలియా భట్ ఎంట్రీ?





పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ' ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. పురాణ ఇతిహాసాల నేపథ్యంతో రూపొందిన ఈ విజువల్ వండర్ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ చిత్రానికి కొనసాగింపుగా రూపొందుతున్న కల్కి2 పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఇప్పటికే చిత్రీకరణ దశలో ఉన్న ఈ సీక్వెల్‌కు సంబంధించిన ఓ ఆసక్తికర వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. బాలీవుడ్ ప్రముఖ నటి ఆలియా భట్ ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

సినీ వర్గాల సమాచారం ప్రకారం, ఆలియా భట్ ఈ చిత్రంలో ప్రత్యేకమైన శక్తివంతమైన పాత్రను పోషిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే మొదటి భాగంలో దీపికా పదుకొణె పోషించిన పాత్రకు బదులుగా ఆమెను తీసుకున్నారనే ప్రచారంలో నిజం లేదని సమాచారం. కథలో కీలక మలుపు తీసుకువచ్చే కొత్త పాత్రలో ఆలియా కనిపించనున్నట్లు టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.

మరింత ఆసక్తికర విషయం ఏమిటంటే, ఆలియా భట్ ఇప్పటికే తన పాత్రకు సంబంధించిన కొన్ని సన్నివేశాల చిత్రీకరణను పూర్తి చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

'ఆర్ఆర్ఆర్' చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువైన ఆలియా భట్, ఇప్పుడు 'కల్కి 2'లో భాగమవుతే సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇక ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ తదితర ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కొనసాగుతున్నట్లు సమాచారం. భారీ నిర్మాణ వ్యయంతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని వైజయంతి మూవీస్ సంస్థ నిర్మిస్తోంది. ఆలియా భట్ పాత్రపై వస్తున్న ప్రచారానికి సంబంధించిన పూర్తి వివరాలు, అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.

# హీరోగా ధనుష్ కుమారుడి ఎంట్రీ?



తమిళ స్టార్ హీరో ధనుష్ తన పెద్ద కుమారుడు యాత్రను హీరోగా పరిచయం చేసేందుకు సిద్ధమవుతున్నారనే వార్త కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. నటుడిగా, దర్శకుడిగా విజయవంతంగా కొనసాగుతున్న ధనుష్.. తన కుమారుడి సినీ ప్రవేశాన్ని ప్రతిష్టాత్మకంగా ప్లాన్ చేస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.సమాచారం ప్రకారం, యాత్ర తొలి చిత్రానికి స్వయంగా ధనుష్ దర్శకత్వం వహించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. తన కుమారుడి కోసం ప్రత్యేక కథను సిద్ధం చేయడంతో పాటు, అతడిని ప్రేక్షకులకు గుర్తుండిపోయే విధంగా పరిచయం చేయాలని ధనుష్ భావిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది.ఈ చిత్రాన్ని ధనుష్‌కు చెందిన 'వుండర్‌బార్ ఫిల్మ్స్' సంస్థతో పాటు ప్రముఖ నిర్మాణ సంస్థ 'ఆర్‌టెక్ స్టూడియోస్' సంయుక్తంగా నిర్మించనున్నట్లు సమాచారం. ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రాథమిక చర్చలు ఇప్పటికే పూర్తయ్యాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి.

ఇక యాత్ర ప్రస్తుతం నటన, నృత్యం, కెమెరా ముందున్న ప్రవర్తన తదితర అంశాల్లో ప్రత్యేక శిక్షణ పొందుతున్నట్లు తెలుస్తోంది. హీరోగా అవసరమైన నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు ప్రొఫెషనల్ శిక్షకుల పర్యవేక్షణలో సాధన చేస్తున్నాడని సమాచారం. అలాగే త్వరలోనే ప్రత్యేక పరీక్షా చిత్రీకరణ నిర్వహించి అతని ప్రదర్శనను అంచనా వేయనున్నట్లు ప్రచారం సాగుతోంది.

ధనుష్ ప్రస్తుతం చేస్తున్న చిత్రాల చిత్రీకరణ పూర్తయిన తర్వాత ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో యాత్ర సినీ అరంగేట్రంపై ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

సాంకేతిక విభాగం పరంగా కూడా ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణలు ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్‌కుమార్ సంగీతం అందించే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ధనుష్‌జి.వి. ప్రకాష్ కలయికలో గతంలో వచ్చిన పలు చిత్రాలు సంగీతపరంగా విశేష విజయాలు సాధించాయి.



# విశాఖ'లో లేడీ డాన్‌గా కాజల్..

దక్షిణాది సినీ పరిశ్రమలో రెండు దశాబ్దాలుగా అగ్ర కథానాయికగా కొనసాగుతున్న కాజల్ అగర్వాల్ ఇప్పుడు తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. కథకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూ సెకండ్ ఇన్నింగ్స్‌లో ముందుకు సాగుతున్న ఆమె, తొలిసారిగా ఓటీటీ ప్రపంచంలో అడుగుపెట్టబోతోంది. 'స్వామి రారా' చిత్రంతో గుర్తింపు పొందిన దర్శకుడు సుధీర్ వర్మ తెరకెక్కిస్తున్న 'విశాఖ' వెబ్ సిరీస్‌లో కాజల్ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ సిరీస్‌పై సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.

ఈ సిరీస్‌లో కాజల్ పాత్ర కథకు ప్రధాన బలంగా నిలవనుందని సమాచారం. సాధారణ గృహిణిగా కనిపించే ఆమె, పరిస్థితుల కారణంగా అండర్‌వల్డ్‌ను శాసించే శక్తివంతమైన మహిళగా మారే పాత్రలో కనిపించనుందని తెలుస్తోంది. అమాయకత్వం, భావోద్వేగం, ఆవేశం, నాయకత్వ లక్షణాలను ఒకే పాత్రలో ఆవిష్కరించే అవకాశం కాజల్‌కు దక్కినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.

యాక్షన్ సన్నివేశాలకు కూడా ఈ సిరీస్‌లో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు సమాచారం. ముఖ్యంగా లేడీ డాన్ అవతారంలో కాజల్ కనిపించే సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించినట్లు తెలుస్తోంది. ఆమె కెరీర్‌లో ఇప్పటివరకు కనిపించని స్థాయిలో యాక్షన్ ప్రదర్శన ఈ సిరీస్‌లో ఉండబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

సినీ పరిశ్రమలో వినిపిస్తున్న కథనాల ప్రకారం, ఈ సిరీస్‌కు మహిళా ప్రధాన కథాంశంతో రూపొందిన ప్రముఖ హిందీ వెబ్ సిరీస్‌ల తరహాలో శక్తివంతమైన కథనం ఉండనుంది. అయితే కథ, పాత్రలు, సంఘటనలు పూర్తిగా కొత్తగా ఉండేలా దర్శకుడు సుధీర్ వర్మ రూపొందించినట్లు సమాచారం.

ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్న 'విశాఖ' వెబ్ సిరీస్ జూలై లేదా ఆగస్టు నెలలో ఓటీటీ వేదికగా విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. అధికారిక విడుదల తేదీపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశముంది. ఇదిలా ఉండగా, కాజల్ అగర్వాల్ సినిమాల పరంగానూ బిజీగా కొనసాగుతున్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా, గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ చిత్రంలో ఆమె కథానాయికగా నటిస్తున్నారు. వెబ్ సిరీస్‌లు, సినిమాలు రెండింటిలోనూ బలమైన పాత్రలను ఎంచుకుంటూ కాజల్ తన సెకండ్ ఇన్నింగ్స్‌ను మరింత విజయవంతంగా కొనసాగిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు నాంది పలకనున్న సీఎం

- ఆరుట్లలో డ్రీమ్ ప్రాజెక్ట్ ప్రారంభం
- కార్పొరేట్ విద్యకు ధీటుగా సదుపాయాలు
- రాష్ట్రవ్యాప్తంగా 100 టీపీఎస్‌లే లక్ష్యం

**యాదాద్రి భువనగిరి జిల్లా, జూన్ 16 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రభుత్వ విద్యను కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్) ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బుధవారం శ్రీకారం చుట్టనున్నారు. తన డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకున్న ఈ పాఠశాలను యాదాద్రి భువనగిరి జిల్లా ఆరుట్లలో ప్రారంభించనున్నారు. రాష్ట్ర విద్యారంగంలో నూతన సంస్కరణలకు ఇది నాంది పలకనుందని ప్రభుత్వం భావిస్తోంది. బుధవారం ఉదయం ఆరుట్లకు చేరుకోనున్న ముఖ్యమంత్రి, తెలంగాణ పబ్లిక్ స్కూల్ పైలాన్‌ను ఆవిష్కరించనున్నారు. అనంతరం అత్యాధునిక డిజిటల్ క్లాస్‌రూమ్స్, సైన్స్ ల్యాబ్స్, లైబ్రరీ, డైనింగ్ హాల్, క్రీడా మైదానాలను పరిశీలిస్తారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులతో సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకోనున్నారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన అనంతరం ప్రత్యేక సభలో ప్రసంగించనున్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో విద్యా కమిషన్ ఏర్పాటు చేసి నిపుణుల సూచనల మేరకు ఈ పాఠశాల రూపుదిద్దుకుంది. తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ డాక్టర్ ఆకునూరి మురళి, సభ్యులు పీఎల్ విశ్వేశ్వర్ రావు, డాక్టర్ చారకొండ వెంకటేష్, జోష్నా శివా రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణలో టీపీఎస్ నమూనా అభివృద్ధి చేయబడింది. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను అందించే ఈ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం బోధన, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన తరగతి గదులు, ఉచిత బస్సు సౌకర్యం, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నభోజనం, సాయంత్రం స్నాక్స్ వంటి సదుపాయాలు కల్పించారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాసానికి సమాన ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

ప్రస్తుతం ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో మొత్తం 1,814 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు అన్ని విభాగాల్లో విద్యార్థుల నమోదు భారీగా పెరగడంతో 'నో అడ్మిషన్' బోర్డు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. చుట్టుపక్కల గ్రామాల విద్యార్థుల కోసం ప్రభుత్వం ఐదు ప్రత్యేక స్కూల్ బస్సులను కూడా ఏర్పాటు చేసింది. టీపీఎస్ పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా మొదటి విడతలో ఆరుట్ల, మంచాల, వంగూరు, పోల్కంపల్లి పాఠశాలలను ఎంపిక చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా 100 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే వసతులతో రూపొందిన ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ రాష్ట్ర విద్యా చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.




# 2.3 కోట్లకు పైగా ఢిల్లీ జనాభా

- జనగణన తొలి దశలో వెల్లడి
- 15 ఏళ్లలో 37.5 శాతం జనాభా పెరుగుదల
- 76 లక్షల ఇళ్లు, 55 లక్షల కుటుంబాల నమోదు
- 2027 తుది జనగణన తర్వాతే అధికారిక లెక్కలు

**న్యూఢిల్లీ, జూన్ 16 (తెలంగాణ ముచ్చట్లు):**



దేశ రాజధాని ఢిల్లీ జనాభా ఊహించని స్థాయిలో పెరిగినట్లు జనగణన2027 తొలి దశ సర్వేలో వెల్లడైంది. 'హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్' ప్రక్రియలో సేకరించిన వివరాల ఆధారంగా ఢిల్లీ జనాభా 2.3 కోట్ల మార్క్‌ను దాటినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఢిల్లీ జనాభా 1.67 కోట్లుగా ఉండగా, గత 15 ఏళ్లలో దాదాపు 37.5 శాతం పెరుగుదల నమోదైనట్లు తాజా అంచనాలు సూచిస్తున్నాయి. దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న నగరీకరణ, ఉపాధి అవకాశాల కోసం ఇతర రాష్ట్రాల నుంచి వలసలు పెరగడం ఢిల్లీ జనాభా వృద్ధికి ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. జనగణన2027లో భాగంగా తొలి దశ సర్వే ఏప్రిల్ 1న ప్రారంభమై జూన్ 14న ముగిసింది. ఈ ప్రక్రియలో అధికారులు ఢిల్లీలోని 45,863 ఎన్యూమరేషన్ బ్లాకులను సందర్శించి విస్తృత స్థాయిలో సమాచార సేకరణ చేపట్టారు. దాదాపు 76 లక్షల ఇళ్లను, 55 లక్షల కుటుంబాలను గుర్తించి వాటి వివరాలను నమోదు చేశారు. నివాస గృహాలు, వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ భవనాలు, అద్దె ఇళ్లు, బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లకు సంబంధించిన సమాచారాన్ని కూడా సేకరించారు. ఈ గణాంకాల ఆధారంగానే జనాభాపై ప్రాథమిక అంచనాలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుతం వెల్లడైన జనాభా గణాంకాలు తాత్కాలికమైనవేనని జనగణన అధికారులు స్పష్టం చేశారు. 2027 ఫిబ్రవరిలో నిర్వహించనున్న రెండో దశ 'పాపులేషన్ ఎన్యూమరేషన్' అనంతరం మాత్రమే తుది జనాభా సంఖ్య ఖరారవుతుందని పేర్కొన్నారు. రెండో దశలో ప్రతి వ్యక్తికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, వలసలు, కుటుంబ నిర్మాణం వంటి కీలక వివరాలను సేకరించనున్నారు. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాతే అధికారిక జనాభా గణాంకాలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనుంది.

జిల్లాల వారీగా పరిశీలిస్తే ఈశాన్య ఢిల్లీ అత్యధిక జనాభా కలిగిన జిల్లాగా నిలిచింది. ఈ జిల్లాలో సుమారు 28 లక్షల మంది నివసిస్తున్నట్లు అంచనా. నైరుతి ఢిల్లీలో దాదాపు 25 లక్షల జనాభా ఉన్నట్లు తేలింది. అధిక జనసాంద్రత, వేగంగా పెరుగుతున్న నివాస కాలనీలు, వలసదారుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల ఈ ప్రాంతాల్లో జనాభా ఒత్తిడి పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు మధ్య ఢిల్లీ, పశ్చిమ ఢిల్లీ, తూర్పు ఢిల్లీ జిల్లాల్లో కూడా జనాభా గణనీయంగా పెరిగినట్లు సర్వేలో వెల్లడైంది. అత్యల్ప జనాభా కలిగిన జిల్లాగా న్యూఢిల్లీ జిల్లా నమోదైంది. దేశ పరిపాలనా కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతంలో కేవలం 2 లక్షల మంది మాత్రమే నివసిస్తున్నట్లు అంచనా. ప్రభుత్వ కార్యాలయాలు, విదేశీ రాయబార కార్యాలయాలు, ప్రత్యేక పరిపాలనా ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో ఇక్కడ నివాస జనాభా పరిమితంగా ఉండటం సహజమని అధికారులు పేర్కొన్నారు. అయినప్పటికీ ఈ ప్రాంతంలో రోజువారీగా లక్షలాది మంది ఉద్యోగులు, సందర్శకులు రాకపోకలు సాగిస్తుండటం ప్రత్యేకతగా నిలుస్తోంది.

నగరీకరణ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఢిల్లీ మౌలిక సదుపాయాలపై ఒత్తిడి కూడా పెరుగుతోంది. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, రవాణా, గృహ నిర్మాణం, ఆరోగ్య సేవలు, విద్యా సంస్థలు వంటి రంగాల్లో మరింత ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ సేవలను విస్తరించడం రాబోయే సంవత్సరాల్లో పెద్ద సవాలుగా మారనుందని అభిప్రాయపడుతున్నారు. 2026 నాటికి ఢిల్లీ జనాభా 2.3 కోట్లకు చేరుకుంటుందని గతంలో పలు అధ్యయనాలు అంచనా వేయగా, తాజా సర్వే గణాంకాలు వాటికి దగ్గరగా ఉండటం విశేషం. 2027లో తుది జనాభా లెక్కలు వెలువడిన తర్వాత దేశ రాజధానిలో జనాభా వృద్ధి, వలసల ప్రభావం, పట్టణీకరణ ధోరణులపై మరింత స్పష్టమైన చిత్రం బయటపడనుంది. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మెట్రో నగరాల్లో ఒకటిగా ఢిల్లీ తన స్థానాన్ని మరింత బలపరుచుకుంటోందని అధికారులు పేర్కొంటున్నారు.

# డీజిల్, విమాన ఇంధన ఎగుమతులపై పన్ను పెంపు

**న్యూఢిల్లీ, జూన్ 16 (తెలంగాణ ముచ్చట్లు):**




మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దేశీయ ఇంధన లభ్యతకు భంగం కలగకుండా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డీజిల్, విమాన ఇంధనం ఎగుమతులపై విధించే విండ్‌ఫాల్ లాభాల పన్నును పెంచుతూ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే పెట్రోల్‌పై ఉన్న పన్నును యథాతథంగా కొనసాగించింది.

జూన్ 16 నుంచి అమల్లోకి వచ్చే తాజా నిర్ణయం ప్రకారం డీజిల్ ఎగుమతులపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.13.50 నుంచి రూ.14కు పెంచారు. అలాగే విమాన ఇంధనం ఎగుమతులపై పన్నును లీటరుకు రూ.9.50 నుంచి రూ.12.50కు పెంచినట్లు ప్రకటించారు. పెట్రోల్ ఎగుమతులపై మాత్రం లీటరుకు రూ.1.50 సుంకాన్ని యథాతథంగా కొనసాగించారు.

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పెరిగిన ఉద్రిక్తతలు, అమెరికా జోక్యంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఈ పరిస్థితుల్లో చమురు సంస్థలు దేశీయ అవసరాలను పక్కనబెట్టి అధిక లాభాల కోసం విదేశాలకు ఇంధనాన్ని భారీగా ఎగుమతి చేయకుండా నిరోధించడమే కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రభుత్వ నిర్ణయంతో దేశీయ మార్కెట్లో ఇంధన సరఫరా స్థిరంగా ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అయితే విమాన ఇంధనంపై పన్ను పెంపు కారణంగా విమానయాన రంగంపై కొంత ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం అమల్లోకి వచ్చిన కొత్త సుంకాలు వచ్చే 15 రోజుల పాటు కొనసాగనున్నాయి.

# పరీక్షల అక్రమాలపై కేంద్రాన్ని నిలదీసిన ఖర్గే

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
- జవాబుదారీతనంలో మోదీ సర్కార్ విఫలమైందని విమర్శ
- పేపర్ లీకేజీలతో కోట్లాది యువత భవిష్యత్తు ప్రమాదంలోనని ఆందోళన

**న్యూఢిల్లీ, జూన్ 16 (తెలంగాణ ముచ్చట్లు):**



దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో చోటు చేసుకుంటున్న అక్రమాలు, పేపర్ లీకేజీల అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. పేపర్ లీకేజీలు, పరీక్షలలో అవకతవకలు వెలుగుచూస్తున్నప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడం విచారకరమని అన్నారు. జవాబుదారీతనం విషయంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

జూన్ 21న నిర్వహించనున్న నీట్ యూజీ 2026 రీఎగ్జామ్‌కు ముందు టెలిగ్రామ్ మెసేజింగ్ యాప్‌పై కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక ఆంక్షలు విధించడాన్ని ఖర్గే తప్పుబట్టారు. టెలిగ్రామ్‌ను బ్లాక్ చేయడం ద్వారా సమస్య పరిష్కారం కాదని, కోట్లాది మంది యువత భవిష్యత్తును దెబ్బతీసిన వ్యవస్థ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.


గత పదేళ్లలో దేశవ్యాప్తంగా సుమారు 90 పేపర్ లీకేజీ ఘటనలు చోటుచేసుకున్నాయని ఖర్గే ఆరోపించారు. ఈ ఘటనల కారణంగా దాదాపు 9 కోట్ల మంది యువత తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. పేపర్ లీక్ మాఫియాను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, చిన్న స్థాయి నిందితులను మాత్రమే పట్టుకొని అసలు బాధ్యులను రక్షించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. పరీక్షల అక్రమాల కారణంగా అనేక మంది విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నారని, కొందరు ప్రాణాలు కూడా కోల్పోయారని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. నీట్, యూజీసీనెట్, ఎస్ఎస్‌సీ, సీయూఈటీ వంటి కీలక పరీక్షల్లో వరుసగా వెలుగుచూసిన అక్రమాలు యువతలో ఆందోళన పెంచాయని అన్నారు. పిల్లల విద్య కోసం అప్పులు చేసి సిద్ధం చేసిన తల్లిదండ్రులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు.

ఇటీవల సీబీఎస్ఈ ఫలితాలపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయని, దేశంలో అత్యంత విశ్వసనీయంగా భావించే యూపీఎస్సీ పరీక్ష కూడా వివాదాల పరిధిలోకి రావడం ఆందోళన కలిగించే అంశమని ఖర్గే వ్యాఖ్యానించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విశ్వసనీయతను పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పరీక్షల అక్రమాల అంశంపై విద్యార్థి లోకాన్ని ఏకం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జూన్ 17 నుంచి రాజస్థాన్‌లోని కోటా నుంచి దేశవ్యాప్తంగా విద్యార్థి సదస్సులు నిర్వహించనున్నారు. మరోవైపు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కూడా పరీక్షల అక్రమాల వల్ల నష్టపోయిన విద్యార్థులకు సంఘీభావం ప్రకటిస్తూ, వారి సమస్యలను ప్రభుత్వం అర్థం చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# కేరళలో షిగెల్లా కలకలం.. నెల రోజుల్లో 70 కేసులు

- ఈ ఏడాదిలో 146 కేసుల నమోదు
- వ్యాధి నియంత్రణకు హైపవర్ కమిటీ ఏర్పాటు

**తిరువనంతపురం, జూన్ 16 (తెలంగాణ ముచ్చట్లు):**



కేరళ రాష్ట్రంలో షిగెల్లా వ్యాధి వ్యాప్తి ఆందోళనకరంగా మారింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 146 షిగెల్లా కేసులు నమోదుకాగా, జూన్ నెలలోనే 70 కేసులు వెలుగుచూడటం ఆరోగ్య శాఖను అప్రమత్తం చేసింది. ఇప్పటివరకు ఈ వ్యాధి కారణంగా ఐదుగురు మృతి చెందినట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం నిపుణులతో కూడిన హైపవర్ కమిటీని ఏర్పాటు చేసింది. మంగళవారం రాష్ట్ర ఆరోగ్య మంత్రి కె. మురళీధరన్ మీడియాతో మాట్లాడుతూ, షిగెల్లా వ్యాప్తిని అత్యంత సీరియస్‌గా తీసుకున్నామని తెలిపారు. మార్చిలో ఒక మరణం సంభవించగా, మిగిలిన నాలుగు మరణాలు జూన్ నెలలోనే చోటుచేసుకున్నాయని చెప్పారు. వైరల్, నీటి ద్వారా వ్యాపించే అంటువ్యాధులను అరికట్టేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) కన్సల్టెంట్ డాక్టర్ ఎస్.ఎస్. లాల్ అధ్యక్షతన ప్రత్యేక హైపవర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కమిటీ ప్రతి వారం సమావేశమై రాష్ట్రంలోని పరిస్థితిని సమీక్షించడంతో పాటు అవసరమైన సూచనలు అందిస్తుందని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి అంటువ్యాధుల వ్యాప్తిని శాశ్వతంగా నివారించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను కూడా కమిటీ రూపొందించనుందని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రత్యేక యాక్షన్ కమిటీతో పాటు జిల్లా స్థాయిలో అవుట్‌బ్రేక్ మానిటరింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ఇదే సమయంలో నిపా వైరస్ పరిస్థితిపై కూడా మంత్రి స్పందించారు. ప్రస్తుతం ఒకరికి మాత్రమే నిపా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని, అనుమానితుల నుంచి సేకరించిన 38కుపైగా నమూనాల్లో మిగిలినవన్నీ నెగెటివ్‌గా తేలినట్లు వివరించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న వ్యక్తి వెంటిలేటర్‌పై ఉన్నారని తెలిపారు. గత అనుభవాల ఆధారంగా నిపా వైరస్ వ్యాప్తిని కూడా సమర్థవంతంగా నియంత్రించగలమనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. షిగెల్లా కేసులు పెరగడానికి స్థానిక సంస్థల ఎన్నికలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి కారణంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా జరగకపోవడం కూడా ఒక కారణమని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రీమాన్సూన్ శుభ్రత కార్యక్రమాలు ఆలస్యమవడంతో వ్యాధి వ్యాప్తికి అవకాశం ఏర్పడిందన్నారు. అయితే దీనిని వ్యక్తిగత వైఫల్యంగా కాకుండా వ్యవస్థాపరమైన జాప్యంగా చూడాలని సూచించారు.

అపరిశుభ్రంగా నిర్వహిస్తున్న రోడ్డుపక్క ఆహార కేంద్రాలు, నాణ్యత ప్రమాణాలు పాటించని హోటళ్లు, తినుబండారాల దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆరోగ్య శాఖ హెచ్చరించింది. ప్యాకేజ్డ్ మినరల్ వాటర్ తయారీ సంస్థలపై కూడా ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపింది. సాధారణ నీటిని బాటిళ్లలో నింపి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఈ అంశంపై కూడా దృష్టి సారించినట్లు వెల్లడించింది. ఆరోగ్య శాఖ వివరాల ప్రకారం షిగెల్లా అనేది పేగు సంబంధిత ఇన్ఫెక్షన్‌కు కారణమయ్యే బ్యాక్టీరియా. కలుషితమైన నీరు, ఆహారం లేదా బాధితులతో సన్నిహిత సంబంధాల ద్వారా ఇది వ్యాపిస్తుంది. విరేచనాలు, కడుపునొప్పి, జ్వరం, వాంతులు, వికారం ప్రధాన లక్షణాలు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వ్యక్తిగత పరిశుభ్రత, శుద్ధి చేసిన నీటి వినియోగం, ఆహార పరిశుభ్రత పాటించడం ద్వారా షిగెల్లా వ్యాధిని నివారించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in